# జీవన

జీవన చీకటి గదిలో కూర్చుంది. ఆ గది తలుపులు గడియలేసుకుంది. తను కావాలనుకుంటే ఒక్క క్షణంలో విద్యుత్ దీపం ఆ గదిని వెలుగుమయం చేస్తుంది తలుపు తెరిస్తే చాలు లోనికి ప్రవేశించి హాయిని అందివ్వటానికి మలయ మారుతం గది బయట నిరీక్షిస్తోంది. ఆ గాలి, వెలుగు కావాలనిపించడం లేదు జీవనకి. అనుకొన్నదొకటి జరిగేది మరొకటి. ఆశించేది ఒకటి లభించేది ఇంకొకటి. ఇంతేనా జీవితం? అయితే ఈ జీవితం తనకి అక్కరలేదు. అనుకున్నది అనుకున్నట్లు ఆశించినది అక్షరాల జరిగి

ఊహలు నిజం కాకపోతే బ్రతుకు ఎందుకు? ఈ జీవితాన్ని అంతం చేసుకుంటే? ఎక్కడున్నావో తల్లీ! ఓ మృత్యుదేవతా! ఒక్కసారి.

ఇంకొక్కసారి అనుకోవడమే తడవు ఆశ్చర్యంగా ప్రత్యక్షమైంది ఆ తల్లి. ఆమె మూర్తి చల్లని వెన్నెలలా తనను సమీపిస్తుందో, వెచ్చగా ఆలింగనం చేసుకోబోతుందో ఒక్క క్షణంలో చేతులు చాచి తన చెంతకు వచ్చేసింది. పిలిచేవుగా వచ్చేను పైపైకి ఉరుకుతుంది. "అంతా మోసం. చల్లగా నులివెచ్చగా చేతుల్లోకి తీసుకొని ఆ తరువాత బ్రతుకునే అంతం చేస్తావు నువ్వు. ఏదో పొరపాటున పిలిచాను. పో వెళ్ళిపో...." భయకంపితురాలయింది జీవన. "ఎందుకలా ఖంగారు పడిపోతావు? నువ్వు రమ్మంటేనే వచ్చేను. ఊరికే రావటానికి నాకేం ఊసుపోదనుకున్నావా?" మృత్యుదేవత ప్రశ్నించింది. తను నిజంగా ఆమె కౌగిట్లో ఒరిగిపోతే ఇంకేముంది? తనవాళ్లకి తను మిగులకుండా పోదూ! తన వాళ్ళేమిటి? వాళ్ళు తనకు అన్యాయం చేస్తున్నారనేగా తను మృత్యుదేవతను పిలిచింది? ఏమో? ఏ అన్యాయములేదు. తను బ్రతకాలి. తనింకా జీవితంలో ఏమి అనుభవించి నిర్ణయించుకుంది? అందుకే తను జీవించాలి. పై జీవితంలో ఎన్నెన్నో సుఖాలు తను వెతుక్కుంటూ లేవూ? జీవన చేతులు జోడించింది. "తల్లీ దయచేసి వెళ్ళు, తొందరపడి పిలిచాను. ఈసారికి క్షమించు" మృత్యుదేవత పక్కున నవ్వింది. ఓసారి క్షమించానమ్మాయి, గుర్తులేదూ? నిలదీసి అడిగింది. అవును గుర్తువచ్చింది. అంది భయంగా. జీవనకి ముచ్చెమటలు పోసాయి. అప్పుడు తను మత్రుదేవతను పిలవటానికి ఎంత బలమైన కారణం నిజంగా ప్రవీణ్ తనను నమ్మించి మోసం చెయ్యలేదూ? ఏమిటో ఈ మృత్యువు తప్పంతా నామీదే తోసేసి మాట్లాడుతోంది. కాలేజీలో చేరిన కొత్తలో ప్రవీణ్ చుట్టూ చుట్టూ

తిరుగుతూంటే ప్రేమిస్తున్నాడనుకుంది. సినిమాలకి, హోటళ్ళకి ఎక్కడకి వెళ్ళినా ఖర్చు అతనే భరిస్తుంటే ఇదే ప్రేమకి పునాది అనుకుంది. ఒక్కటయి పోయిన ప్రశాంత సమయంలో నువ్వు నాదానివే అంటే ఇంతకన్నా ఆధారాలు అక్కరలేదు వివాహ బంధానికి అనుకుంది. అన్నీ కల్లలు చేసి అతను అరవయి వేలకి అమ్ముడు పోయినప్పుడు "నువ్వు ఒలకపోసిన అనురాగం ఆవిరయి పోయిందా? మనం కలబోసుకున్న మమతలన్నీ మట్టిపాలేనా? నువ్వు చూపించిన ప్రణయలోకాలన్నీ నీ తలపుకే రావటం లేదా? అని తను అన్నప్పుడు ఓ వికటాట్టహాసం చేసి అవన్నీ అరవయి వేలతో సాటి వస్తాయా? నువ్వు అలాగివ్వగలిగితే చూడు. అవన్నీ ఈజీగా అనుభవిద్దాం" అని తేలికగా ప్రవీణ్ కొట్టి పారేస్తే తనకి లోకం శూన్యమే అని, ఇక జీవించలేను అనుకోటం తన తప్పా? మృత్యుదేవత తనను అంటోంది కాని. తను అలా అనుకోవటం మానవసహజం కాదూ.

లోలోన చెలరేగుతున్న ఊహలు గ్రహించిన మృత్యుదేవత "నన్ను తొలిసారి పిలవడమే నీ తప్పు కాదనుకుంటే అలా అనుకోవటం సహజమే అయితే పిలవగానే ప్రత్యక్షమయ్యాను కదా. అప్పుడే నాతో ఎందుకు వచ్చేయ్యలేదు! అంది. అబ్బబ్బ తల తిరిగిపోతుంది. నన్నింకేం ప్రశ్నించి వేధించకు. ఈ సారికూడా క్షమించు అమ్మనాన్నలకి ఇష్టమయిన ఆ పెళ్ళే చేసుకుంటాను. అత్తవారింట్లోనే హాయిగా ఉండటానికి ప్రయత్నిస్తాను. జీవన మాటలకి ఆమె కళ్ల ముందు నుంచి అదృశ్యమయింది మృత్యు దేవత. జీవన తేలికగా ఊపిరి పీల్చుకుంది. గట్టిగా కణతలు నొక్కుకుంటూ ఇంత సేపటికీ వెళ్ళింది. ఇక ఎప్పుడూ ఈ దెయ్యాన్ని తలుచుకోకూడదు. మరోసారి నిశ్చయించుకుంది.

జీవన హైస్కూలు చదువు పూర్తిచేసి కాలేజీలో చేరగానే ఆలోచనలెరగని ఆవేశంలో ప్రేమలో పడింది. ప్రవీణ్ ధనవంతుడు జీవన మధ్యతరగతి యువతి. ఆమె అమాయకత్వం ఆసరాగా ప్రవీణ్ ఆడిన నాటకానికి చెదిరిపోయిన జీవన మృత్యువుని చిన్న సీసా ఆధారంగా తొలిసారి పిలిచింది. ఆ చీకటి గదిలో ఆమెను అతిప్రేమగా ఆదుకోవటానికి అన్నట్లు వచ్చిన మృత్యుదేవతను చూసి జీవితం మీద తీపిని ఊహించుకోవటం మొదలు పెట్టింది. "నిజంగా నువ్వు వచ్చేసావా? ప్రవీణ్ ఎవడు? మధ్యలో వచ్చిన వాడు మాయమయితే అయ్యాడు. నన్ను కని పెంచిన అమ్మనాన్నలు ఉన్నారు. నా సుఖం వాళ్ళకి కావాలి. వాళ్లు చెప్పినట్లు వింటూ వాళ్లు ఏర్పరచిన బాటలో నడుస్తూ బ్రతుకు సుఖమయం చేసుకుంటాను. దయచేసి వెళ్ళిపో అంది. పదహారు వసంతాల ప్రాయంలో ఇప్పుడు కుదిరిన సంబంధం జీవనకి నచ్చకపోవటానికి ఒకే కారణం. ఇదే. కోరుకున్న లక్షణాలు ఏవీ వాసులో లేకపోవడం, అందమైన పెద్ద బంగళా, ముద్దొచ్చే చిన్నకారు. తన భర్త మంచి ఆఫీసరు. ఇవేవీ కుదరలేదు. వాసు ఓ చిన్న కంపెనీలో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ఇంకా కొంతకాలం పెళ్ళివద్దు. మంచి సంబంధం కలిసి వస్తుందేమో అని తను చెబితే వినని అమ్మనాన్నలు ఈ సంబంధం నిశ్చయం చేసారు. ఇప్పుడయిన, జీవన మళ్ళీ అప్పటిలానే అనుకుంది ప్రవీణ్ తన జీవితం నుండి నిష్క్రమించినందుకు అప్పుడు, వాసు తన జీవితంలో ప్రవేశిస్తున్నందుకు ఇప్పుడు "మృత్యువు తనను కబళిస్తే బాగుండును" తలవడమే తడవుగా మళ్ళీ ప్రత్యక్షమైన తనను ఎంత సేపు కలవరపెట్టింది! పెళ్ళికూతురు కావలసిన తను నిర్జీవంగా కట్టెలా మారిపోవటమా? తను ఎలా అయితేనేం వాదించి బ్రతిమాలి

పంపగలిగింది. ఇలాంటి ఊహలు ఇక రానివ్వను. అనుకుంటూ బ్రతుకులోని తీపితీపి తలపులను మళ్ళీ మనస్సు నిండుగ నింపుకుని పెళ్ళికూతురయింది.

అత్తవారింట జీవన సుఖజీవనాన్నే గడుపుతోంది. కాలం మరో సారి తన ఆనందాన్ని కాజేసినపుడు అప్పుడు మళ్ళీ అర్థరాత్రి నూతిగట్టు మీద జీవన "ఛీ, ఛీ.... ఏం బ్రతుకిది? అంతా తనమాటే సాగాలా? నామాట ప్రకారం ఏదీ జరగనపుడు బ్రతికి లాభమేమిటి. ఆయనకి ఇష్టం వచ్చినప్పుడు అప్పుడప్పుడు త్రాగి రావటం పెద్ద తనకే సర్వహక్కులు ఉన్నట్టు బాబు విషయంలో ఆ పట్టుదల ఏమిటి? చదువు మాన్పించి ఉద్యోగం చేయిస్తారట మనం ఇంత కన్నా పై చదువులకి సాగలేమని పైగా నచ్చచెప్పడం ఒకటి. తాగి తగలేయటం మానేస్తే చదువులు పెళ్ళిళ్ల అన్నిటికి తూగగలం అంటే కస్సుబుస్సుమంటు పైన కలియబడ్డారు. "నువ్వు నా భార్యవి. నన్నెదిరించి మాట్లాడే హక్కు నీకు లేదు. రెండు, మూడు సార్లు ఏదో ఫ్రెండ్స్ బలవంతం మీద తాగివచ్చానో లేదో వ్యసనపరుడ నయినట్లు ఏమిటి నీ వాగుడు? అంటే ఎలా ఊరుకోగలను "అవు నవును మీ మగబుద్ధి ఇంతే మరి. భార్య అంటూ కాళ్ళ క్రింద చెప్పులా అణచివేస్తారు. పెళ్ళాల్ని, వాళ్ళమాటలకి గౌరవం ఇవ్వరు సరికదా అధికారం ప్రదర్శిస్తారు. ఆడదానివి నువ్వు చెప్పేదేమిటి? అంటారు అని నేనంటే ఆయనకి ఎంత కోపం వచ్చిందని? ఉన్న పాటున ఉగ్రమూర్తిలా లేచారు. "నోటిక వచ్చినట్లు పేలకు. నేను చెప్పినట్లు పడిఉండు. లేకపోతే చావు" అని విరుచుకుపడ్డారు. చెప్పి నట్లు చెప్పుకింద పేనులా పడిఉండే కంటే చావడమే నయం అనుకొన్న తను ఈ నూతిగట్టుపై చేరింది. నూతిలోతులోనికి ఒక్క సారి గట్టిగా కళ్ళుమూసుకుంది.

"రారా నీ కోరిక ఇదిగో తీర్చేస్తున్నా చెయ్యిపట్టి తనను ఎవరో లోపలికి లాగేస్తున్నారు. వెళ్ళిపోతే ఈ గోలగోంది ఇక ఉండదు. ఆ తలపుని భరించలేక గడ, గడ లాడిపోయింది.

"నేను రాను. ముమ్మాటికి రాను. భర్త నన్ను లెక్కచేయక పోతే కొడుకు, కోడలు నన్ను పువ్వుల్లో పెట్టి చూసుకోరూ, బాబు గాడికి నేనంటే ప్రాణం. కాబోయే కోడలు దాని ప్రాణాలకన్న ఎక్కువగా చూసుకోదూ" నువ్వు సవాలక్ష చెప్పినా నేను నిన్ను వదలను. అంత మాట నిలకడ లేదూ క్షణంలో చావాలనుకొని మరుక్షణం బ్రతుకుమీద గంపెడు ఆశలు, మృత్యుదేవత మాటలకి నిలువెల్ల కంపించిపోతూ శక్తినంతా కూడ దీసుకొని క్రిందకు దుమకబోయింది. బోరిగిల్లుపడ్డ జీవన హమ్మయ్య పడితే పడ్డా లోపల కాదుగా పైనపడి బ్రతికిపోయా అనుకొంది దుమ్ముదులుపు కుంటూ.

బ్రతుకులోని నాలుగవ దశలో ఉన్న జీవనకి మనసు నిండా రగిలే మంటలే, బ్రతుకు నిండా కడగళ్ళ ముళ్ళే. అవన్నీ ఆమె ఊహలే అయినా తెగ కలవరపడిపోతుంది. కోడలు పని తొందరలో కాస్త విసుక్కున్నా, ఎన్నో రకాలుగా సంసార బాధ్యతలు నిర్వ హిస్తున్న కొడుకు తల్లితో మాట్లాడకపోయిన, మనమళ్ళు సతమత మవుతూ ఆవిడ పిలిచినపుడల్లా దగ్గరకు చేరకపోయినా, విపరీ తార్థాలు కల్పించుకుంటుంది. తనకి తానే జీవితాన్ని నరకప్రాయం చేసుకుంటున్నా జీవన జ్వరంతో ఓ నాలుగురోజులు మంచాన పడ గానే ఒక్కొక్కరినీ పరిశీలించి, "మీకు నేనంటే అవంతైనా అభి మానం లేదు. చచ్చినా ఒక్కరూ ఏడవరు. అసలు బ్రతికి ఉన్నా నని ఏడుస్తున్నారేమో" అంటూ తను శోకింతలు మొదలుపెట్టింది.

"ఇంక ఏడవకు జీవన, నీ జీవన వ్యవధి అయిపోయింది. నేను వచ్చేసాను. ఏభైఏళ్లు క్రితం తొలిసారిగా చూసిన ఆ వెలుగుమూర్తి జీవనను తన కౌగిట్లోకి తీసుకుంటుంది" నువ్వు వచ్చేసావా! నాకు తెలియకుండానే పిలిచావా?" మృత్యుదేవత నవ్వింది. "మీ మనుష్యులంతా పిరికివాళ్ళు. మాటిమాటికి ఏ చిన్న నిరాశ ఎదురైన చస్తే బాగుండును. అనుకొనిచావాలని ప్రయత్నించి నన్ను చులకన చేస్తారు తీరా తెగించే ధైర్యం ఉండదు. నీ మాటే ఆలోచించుకో, నన్ను ఎన్ని సార్లు పిలిచావో నీ పిలుపువిని నేను వచ్చినపుడు ఏ ఒక్కసారి నువ్వు వచ్చేసినా ఇవాళ నేను రావలసిన అవసరం లేకపోను. నీలో ఎంత పిరికితనం ఉందో తెలుసుకోవాలనే పిలవగానే పలికే దాన్ని. నిజానికి నీ పిలుపుతో పనిలేదు నాకు. నేను జీవితకాలం పూర్తి అయినప్పుడు మాత్రమే ప్రతి జీవి దగ్గరికి వచ్చి నాకార్యాన్ని నిర్వర్తించుకుంటాను.

నేను వచ్చింది అందుకే. ఈ వేళతో నీ జీవన వ్యవధి అయిపోయింది. చప్పినుగా నన్ను నువ్వు ఎంత ప్రార్థించినా ఇకనువ్వు జీవించవు... జీవించడం అసంభవము........

చూడు జీవనా! నిన్నొక్కటి అడుగుతున్నాను. ఇలా మాటిమాటికి నన్నెందుకు తేలిక చేస్తుంది మీ మానవ జాతి! కష్టసుఖాలు ఆశ నిరాశలు అన్ని రకాల ఒడిదుడుకులు అనుభవించటానికే మానవజన్మ. నాకు మానవాళిని వేడుకోవాలని ఉంటుంది. అస్తమానం నన్నిలా చులక చేయవద్దు మీ పిలుపుతో నాకు పనిలేదని చెప్పాలని ఉంటుంది. గద్గదికంగా వినిపించింది మృత్యుదేవత స్వరం. తన కళ్ళు శాశ్వతంగా మూయబడిపోతున్న సమయంలో మృత్యుదేవత కళ్ళలో కన్నీటిని చూసింది జీవన. ●